సాక్షి
కామారెడ్డి
శుక్రవారం ı 21 ı జూన్ ı 2024



ప్రజలకు ఇబ్బంది లేకుండా..
ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు.
- 8లో ▸



నాణ్యమైన భోజనం అందించాలి
బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
39.7 /23.5
ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

అక్రమ లేఅవుట్‌లపై సీఎస్‌కు ఫిర్యాదు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ లేఅవుట్‌లు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి కోరారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారిని కలిసి అక్రమ లేఅవుట్‌లు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఇదే అంశంపై ఆయన వారం క్రితం విజిలెన్స్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు.

27 వరకు బీఈడీ రీవాల్యుయేషన్‌కు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ కోసం ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ దరఖాస్తులను పొందవచ్చన్నారు. రీవాల్యుయేషన్ ఫీజు రూ.500 (ఒక్కో పేపర్‌కు), రీకౌంటింగ్‌కు రూ.300(ఒక్కో పేపర్‌కు), దరఖాస్తు ఫారానికి రూ.25 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుతో పాటు మెమో జిరాక్స్ జతచేయాలన్నారు. బీఈడీ కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థుల నుంచి రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ ఫీజు వసూలు చేసి యూనివర్సిటీ అకౌంట్‌కు ఈ నెల 28 లోపు చెల్లించడంతో పాటు ఈ నెల 29 సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు ఫారాలు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్ మెమో, నిర్ణీత రుసుము లేకుండా దరఖాస్తు ఫారాలను అంగీకరించబోమని స్పష్టం చేశారు. వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్వోబీ పనులను వేగంగా పూర్తి చేయాలి



నిజామాబాద్‌రూరల్: మండలంలోని మాధవనగర్ ఆర్వోబీ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హన్మంతు సూచించారు. గురువారం ఆయన పనులను పరిశీలించారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలన్నారు. డిప్యూటీ ఇంజినీర్ ప్రవీణ్, కార్పొరేటర్ ప్రమోద్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

'ఓటమిని జీర్ణించుకోలేకే ఆరోపణలు'



సుభాష్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిని జీర్ణించుకోలేక ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని ఎంపీ అర్వింద్ ధర్మపురి విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో వారిరువురు తనపై చేసిన ఆరోపణలపై ఎంపీ అర్వింద్ గురువారం హైదరాబాద్ నుంచి వీడియో సందేశాన్ని విడుదల చేశారు. బీజేపీ ప్రలోభాలతో గెలిచిందని, ఓటర్లకు డబ్బులు పంచారని, మోదీ ప్రభావం కలిసొచ్చిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొనడం సరికాదన్నారు. తాను మోదీ ప్రభావంతోనే రాజకీయాల్లోకి వచ్చానని గుర్తుచేశారు. ఆర్మూర్, బాల్కొండ, ఇతర నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు రూ.200 నోట్లు పట్టుకుని రోడ్లపై ఎందుకు తిరిగారని ప్రశ్నించారు. జగిత్యాల ప్రజలపై జీవన్‌రెడ్డికి ప్రేమ లేదని, ముస్లింల కోసమే ఆయన పని చేస్తున్నారని విమర్శించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కూడా గౌరవాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మూత్రశాలల్లో టైల్స్ వేయొద్దని అధికారులను సుదర్శన్‌రెడ్డి బెదిరిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్‌తో మాట్లాడి జిల్లావ్యాప్తంగా మూత్రశాలల్లో టైల్స్ వేయాలని ఆదేశించాలని కోరానన్నారు.

యోగానుయోధులు!

- సాధన చేస్తూ.. నలుగురికి నేర్పిస్తూ..
- రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణిస్తున్న పలువురు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

సాక్షి, కామారెడ్డి: నేటి ఉరుకులు, పరుగుల జీవన ప్రయాణంలో అనేక మంది ఆహార నియమాలు పాటించలేకపోతున్నారు. ఒత్తిళ్లతో శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. వీటి నుంచి విముక్తికి యోగాభ్యాసం ఒక మేలి మార్గమని యోగా సాధకులు అంటున్నారు. క్రమం తప్పని యోగాసాధన, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లతో అనేక రుగ్మతలను నివారించవచ్చని పేర్కొంటున్నారు. జిల్లాలో పలువురు యోగా గురువులు నిత్యం యోగా సాధన చేస్తూ.. నలుగురికి నేర్పిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీలలో మెరుస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం' సందర్భంగా వారిపై కథనం..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో పలు సంస్థల ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో రోజూ వేకువజాము నుంచే యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ యోగా నేర్పిస్తున్నారు.



కామారెడ్డిలోని పతంజలి యోగా కేంద్రంలో ఆసనాలు వేస్తున్న సాధకులు


పిల్లలతో ప్రాణాయామం, యోగాసనాలు సాధన చేయిస్తే మానసికంగా, శారీరకంగా బలపడతారని యోగాచార్యులు పేర్కొంటున్నారు. మహిళలు కూడా చాలా మంది యోగలో పాల్గొంటున్నారు. నిత్యం యోగా కేంద్రాలకు వెళ్లి ఆసనాలు సాధన చేస్తున్నారు. యోగాతో ఎంతో మానసిక ప్రశాంతత లభిస్తోందని పలువురు యోగా సాధకులు పేర్కొంటున్నారు.

పదిహేనేళ్లుగా..



ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పి.అంజయ్య జిల్లా పతంజలి యోగా సమితి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పదిహేనేళ్లుగా యోగా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. సమితి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాల నిర్వహణతోపాటు కార్యకర్తలను సమన్వయం చేస్తూ నిరంతరం యోగా ఆచరిస్తున్నారు. ఎక్కడ యోగా పోటీలు జరిగినా సమితి సభ్యులతో కలిసి హాజరవుతున్నారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని పేర్కొంటున్నారు.

84 ఏళ్ల వయసులోనూ..



కామారెడ్డి పట్టణానికి చెందిన యోగా గురువు గరిపల్లి అంజయ్యకు 84 ఏళ్లు. ఆయన నాలుగు దశాబ్దాలుగా యోగా సాధన చేస్తున్నారు. ఆయన ఎంతో మందికి యోగా నేర్పించారు. వేలాది మందికి యోగాపై అవగాహన కల్పించారు. ఆయన దగ్గర నేర్చుకున్న వారే ఇప్పుడు యోగా గురువులుగా ప్రాచుర్యంలో ఉన్నారు. ఈ వయసులోనూ బీపీ, షుగర్ సమస్యలు దరిచేరలేదని అంజయ్య చెబుతారు. యోగా తన జీవితంలో భాగమైందని పేర్కొంటున్నారు. కామారెడ్డిలో ప్రస్తుతం వేలాది మంది యోగా చేస్తూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నిస్తుండడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందంటున్నారు.

విదేశాల్లో వేలాది మందికి శిక్షణ



రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన బండి రాములు బ్రెహెయిన్ దేశంలో దశాబ్దం పాటు ఉన్నారు. ఆయన అక్కడే వేలాది మందికి యోగా నేర్పించారు. వివిధ దేశాలకు చెందిన వారు ఆయన శిష్యులుగా ఉన్నారు. సొంతూరుకు వచ్చిన తర్వాత కామారెడ్డి పట్టణంలో స్థిరపడ్డారు. ఇక్కడ నిత్యం ఎంతో మందికి యోగా నేర్పిస్తున్నారు. యోగా వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సైతం దూరమవుతాయని అంటున్నారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండగలుగుతామన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో..



కామారెడ్డి జిల్లా పతంజలి యోగా సమితి అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి రెండు దశాబ్దాలుగా నిరంతరం యోగాసనాలు వేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీలలో పాల్గొన్నారు. మూడుసార్లు రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించారు. ఆయన నిత్యం యోగా సాధన చేస్తూనే మరికొందరికి నేర్పిస్తున్నారు. ఆయన తనకు తెలిసినవారికి రోజూ ఫోన్‌చేస్తూ యోగా సాధన చేయాలని సూచిస్తుంటారు. యోగా కేంద్రానికి ఆహ్వానిస్తూ యోగాభ్యాసంపై అవగాహన కల్పిస్తున్నారు.

బాన్సువాడకు సబ్ కలెక్టర్!



- ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ అధికారి
- త్వరలో నియమించే అవకాశం

సాక్షి, కామారెడ్డి: బాన్సువాడ రెవెన్యూ డివిజన్ స్థాయి పెరిగింది. త్వరలో ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ అధికారి డివిజన్ అధికారిగా రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం బాన్సువాడ రెవెన్యూ డివిజన్‌కు అధికారిగా ఆర్డీవో ఉన్నారు. అయితే రెవెన్యూ పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రంలోని పలు రెవెన్యూ డివిజన్లను అప్‌గ్రేడ్ చేస్తూ ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమించాలని నిర్ణయించింది. ఆయా రెవెన్యూ డివిజన్లలో ఆర్డీవో పోస్టులను సబ్ కలెక్టర్ పోస్ట్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో బాన్సువాడ ప్రాంతం బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో కొనసాగేది. జిల్లాల ఏర్పాటు తర్వాత బాన్సువాడ నియోజకవర్గంలో సగభాగం కామారెడ్డి జిల్లాలో, మిగతా సగభాగం నిజామాబాద్ జిల్లాలోకి వెళ్లాయి. అదే సమయంలో బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోని ఆయా మండలాలను కలిపి బాన్సువాడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే డివిజన్ అధికారి స్థాయిని అప్‌గ్రేడ్ చేసి సబ్ కలెక్టర్ పోస్టును ఏర్పాటు చేశారు. ఐఏఎస్ అధికారిని సబ్ కలెక్టర్‌గా నియమించనున్నారు.

ఆర్మూర్, బోధన్...

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బోధన్ రెవెన్యూ డివిజన్ల స్థాయి కూడా పెరిగింది. రెండు చోట్ల ఆర్డీవోలకు బదులు సబ్ కలెక్టర్‌లను నియమించనున్నారు. ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమిస్తారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

సుభాష్‌నగర్ : రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా సాగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. ఈ నెల 24 నుంచి 29 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల పరీక్ష, ఈ నెల 30 నుంచి జూలై 04 వరకు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అలాగే ఈనెల 23న నిర్వహించనున్న నీట్ పీజీ ఎగ్జామ్ ఏర్పాట్లపై సమీక్ష జరుపుతూ, అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షలు నిర్ణీత తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో కొనసాగుతాయన్నారు. నీట్ పీజీ ఎగ్జామ్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్షలు సాఫీగా కొనసాగేలా సంబంధిత అధికారులతోపాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఆదేశించారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు రెండు గంటల ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, కలెక్టరేట్ పరీక్షల విభాగం పర్యవేక్షకుడు పవన్, ఆర్టీసీ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలెప్పుడో?



- రుణమాఫీ, రైతుబంధు పథకాలపై స్పష్టత కరువు
- అంతటా ఈ అంశాలపైనే జోరుగా చర్చలు
- పరిమితులు, నిబంధనలపై రైతుల్లో సందేహాలు
- సర్కారు మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు

కామారెడ్డి క్రైం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతాంగం పంటల సాగులో నిమగ్నమైంది. రైతుబంధు కింద పెట్టుబడి సాయం ఇప్పటికే అందాల్సి ఉంది. అయితే పెట్టుబడి సాయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. రుణమాఫీపైనా రోజుకో రకమైన ప్రచారం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా రైతుబంధు, రుణ మాఫీపైనే చర్చలు నడుస్తున్నాయి. గత ప్రభుత్వం ఎకరానికి సీజన్‌కు రూ.5 వేల పెట్టుబడి సాయం ఇవ్వగా.. తాము అధికారంలోకి వస్తే దానిని రూ. 7,500లకు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రూ. 2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని పేర్కొంది. రాష్ట్రంలో ఆ పార్టీనే అధికారంలోకి రావడంతో రుణమాఫీతోపాటు పెట్టుబడి సాయం పెంపుపై రైతుల్లో ఆశలు చిగురించాయి. జిల్లాలో 3.13 లక్షల మంది రైతులున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా అప్పటికే యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం అందించారు. ఖరీఫ్‌నుంచి ఎకరాకు రూ. 7,500 చొప్పున అందిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పక్షం రోజులు కావస్తోంది. ఇప్పటికీ రైతుబంధుపై ప్రభుత్వంనుంచి స్పష్టమైన ప్రకటన రాలేదు. కాగా పాత పద్ధతిలో రైతుబంధు ఇచ్చినా జిల్లాకు ఒక పంటకు రూ. 270 కోట్ల నిధులు అవసరం. పెంచి ఇస్తే అదనంగా మరో రూ. 135 కోట్లు అవసరం అవుతాయి. సీజన్ ప్రారంభమైనందున పెట్టుబడుల కోసం డబ్బులు అవసరం ఉన్నాయని, త్వరగా రైతుబంధు నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

మార్గదర్శకాలు వచ్చేదెప్పుడో?

రైతు భరోసాలో భాగంగా అమలు చేయాల్సిన పథకాల్లో ప్రధానమైనవి పంట రుణ మాఫీ, రైతుబంధు. వాటి అమలుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించే పనిలో ఉంది. రాష్ట్ర ఖజానాపై తక్కువ భారం పడేలా కసరత్తు చేస్తోంది. రైతుబంధులో అనేక లోపాలు ఉన్నాయని, వ్యవసాయం చేయని పడావు భూములు, కొన్ని చోట్ల రోడ్లు, వెంచర్‌లకు సైతం డబ్బులు పడుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. వ్యవసాయం చేసే భూములకు, అది కూడా 5 ఎకరాల వరకు మాత్రమే రైతు బంధు ఇచ్చేలా కొత్త మార్గదర్శకాలను రూపొందించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ లెక్క తేల్చడానికి సమయం లేకపోవడంతో పాత పద్ధతిలోనే రైతుబంధు జమ చేసే అవకాశాలున్నాయని రైతులు భావిస్తున్నారు. రుణమాఫీ విషయంలోనూ భారాన్ని తగ్గించుకోవడానికి సర్కారు ప్రయత్నిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, ఇతర రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్న వారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లించే వారు తదితరులకు రుణమాఫీ ఇవ్వరనే ప్రచారం జరుగుతోంది. దీంతో రైతుబంధు, రుణమాఫీ పథకాలు ఎవరికి వర్తిస్తాయి, ఎవరికి వర్తించవన్న అంశాలపై గ్రామాలలో జోరుగా చర్చ నడుస్తోంది. రెండు పథకాలపై ప్రభుత్వ మార్గదర్శకాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థికి మాత్ర వేస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాల బారి నుంచి రక్షించుకోవచ్చని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డిలోని ముదాంగల్లీలో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడుపులో నట్టలు ఉన్నట్లయితే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపు నొప్పి వంటి సమస్యలతో బాధపడతారన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ఏటా ఫిబ్రవరి, జూన్ మాసాల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా నులిపురుగులు నశిస్తాయని, పిల్లలు ఆరోగ్యవంతంగా పెరుగుతారని పేర్కొన్నారు. జిల్లాలో ఒక సంవత్సరం నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 2,50,254 మంది ఉన్నారని, వారికి వంద శాతం అల్బెండజోల్ మాత్రలు అందించేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. గురువారం మాత్రలు వేసుకోని వారికి తిరిగి ఈనెల 27న మాప్ అప్ కార్యక్రమం ద్వారా వేయిస్తామని పేర్కొన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలలో ఉన్న పిల్లలతో పాటు ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి సైతం అల్బెండజోల్ మాత్రలు వేయాలని అధికారులకు సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన మరుగుదొడ్లు, మంచి నీటి ట్యాంక్, కుళాయిలు, తరగతి గదుల్లో లైట్‌లు, ఫ్యాన్‌ల ఏర్పాటు, కిటికీల మరమ్మతు పనులను పరిశీలించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్ ప్రముఖ, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్య, హెచ్‌ఎం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

సదాశివనగర్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. మండల కేంద్రంలోని డంపింగ్ యార్డును సందర్శించి దాని నుంచి గ్రామ పంచాయతీకి వస్తున్న ఆదాయం గురించి కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఆదాయం పెంచాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మిషన్ భగీరథ సర్వే వివరాలు తెలుసుకున్నారు. ఎంఈవో యోసెఫ్‌తో మాట్లాడి అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ఎంబీ రికార్డు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తరగతి గదుల్లోకి వెళ్లి బోధన తీరును పరిశీలించారు. అనంతరం ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు'

కామారెడ్డి టౌన్: కల్తీ మద్యం, కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అధికారి రవీందర్‌రాజు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గురువారం రాజంపేట మండలంలో ఆకస్మికంగా దాడులు చేసి అక్రమ మద్యం, కల్తీ కల్లు అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు రూ. 6.72 లక్షల విలువ చేసే అక్రమ మద్యం, కల్తీ కల్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కల్తీ మద్యం విక్రయిస్తున్న వారిపై 18 కేసులు నమోదు చేశామని, ముగ్గురిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. ఐదు చోట్ల కల్లు నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించామని, అందులో క్లోరల్ హైడ్రేట్ కానీ డైజోఫామ్ కానీ కలపలేదని నిర్ధారణ అయ్యిందని వివరించారు.

'స్థానిక సంస్థలపైనా పార్టీ జెండా ఎగరేయాలి'



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో లాగే స్థానిక సంస్థల ఎన్నికలలోనూ పార్టీ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు ఐక్యంగా ముందుకు సాగాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు. గురువారం జుక్కల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జుక్కల్, మద్నూర్, బిచ్కుంద మండలాల పార్టీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. పంచాయతీ ఎన్నికలతో పాటు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు పార్టీ నేతలు సన్నద్ధం కావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు గుర్రాలను గుర్తించి పోటీకి సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. పార్టీకి నమ్మకద్రోహం చేసిన వారికి సరైన సమయంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

క్లుప్తంగా

చెస్,బాక్సింగ్ క్రీడాకారులకు సన్మానం



పిట్లం(జుక్కల్) : కేరళ రాష్ట్రంలోని జూబ్లి మెమోరియల్ హాల్, త్రివేండ్రంలో ఈనెల 7, 8, 9వ తేదీల్లో నిర్వహించిన 12వ చెస్ బాక్సింగ్ జాతీయ చాంపియన్‌షిప్‌లో పిట్లం ప్రతిభ హైస్కూల్ నిర్వాహకులు నర్సింగ్‌రావ్ కూతురు ప్రతిభ సీనియర్ మహిళా విభాగంలో 3 బంగారు పతకాలు సాధించగా ఆమె తమ్ముడు విజయ్ రాఘవేంద్ర రావు సీనియర్ పురుషుల విభాగంలో వెండి పతకంను సాధించాడు. ఈ సందర్భంగా వారిని గురువారం నారాయణ్ ఖేడ్‌లోని ఎంపీ నివాసంలో ఎంపీ సురేశ్‌షెట్కార్ ప్రత్యేకంగా సన్మానించారు.

సరైన జీవన విధానానికి యోగా అవసరం



భిక్కనూరు: మానవుడి సరైన జీవన విధానానికి యోగా ఎంతగానో ఉపకరిస్తుందని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ యోగాకు సమయం కేటాయించాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సమన్వయకర్తలు డాక్టర్ అంజయ్య, డాక్టర్ హరిత, అధ్యాపకులు మోహన్‌బాబు, లలిత పాల్గొన్నారు.

దర్జాగా నకిలీ విత్తనాల అమ్మకాలు



పిట్లం(జుక్కల్) : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన రైతు రామరావ్ పిట్లంలోని ఎరువుల దుకాణంలో ఈనెల 13న రూ. 3,500తో 25 కేజీల సోయా విత్తనాలు కొన్నాడు. సరైన సమయానికి ట్రాక్టర్ దొరకకపోవడంతో ఇంట్లోనే విత్తనాల సంచీ ఉంచాడు. ఈ గురువారం ట్రాక్టర్ దొరకడంతో సంచీ విప్పి చూడగా విత్తనాలకు ఫంగస్ వచ్చింది. దీంతో సదరు దుకాణాదారుడికి విత్తనాలు చూపించగా వేరే విత్తనాలు అందజేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపాడు. నకిలీ విత్తనాలు విక్రయించవద్దని అధికారులు పేర్కొంటున్నప్పటికీ కొన్ని మండలాల్లో దర్జాగా నకిలీ విత్తనాలు అమ్ముతున్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా ఉపాధ్యక్షులుగా రోతహన్ మోహన్ నాయక్‌ను నియమితులయ్యారు. జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు తేజావత్ బెల్లయ్య నాయక్ బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కోటియా నాయక్, ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీలు నిర్మించాలి

మాచారెడ్డి : నాలుగు లైన్ల రోడ్డు నిర్మించారు కానీ సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ నిర్మించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు గురువారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి మొరపెట్టుకున్నారు. ఈ మేరకు 50 స్థానికుల సంతకాలతో వినతి పత్రాన్ని అందజేశారు. ఓ మోస్తరు వర్షం పడినా ఇళ్ళలోకి నీళ్ళు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ శాఖ వ్యవస్థ

- దర్జాగా ఏఈ సంతకం ఫోర్జరీ చేసిన ఉద్యోగులు
- సెక్షన్ల పరిధిలో పర్యవేక్షణను గాలికొదిలేసిన ఉన్నతాధికారులు



విద్యుత్‌శాఖ ప్రగతిభవన్

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖలో అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా విద్యుత్‌శాఖలోని టౌన్–3 ఏడీఈ సెక్షన్ పరిధిలో నాగారం సెక్షన్ ఏఈ సంతకం ఫోర్జరీ జరిగింది. ఆ ఉద్యోగి ఈ నెల 25 నుంచి జూన్ 10 వరకు సెలవులో ఉన్నారు. పై స్థాయి అధికారులు నాగారం సెక్షన్‌కు సంబంధించి ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదు. సమస్యల నిమిత్తం ఏఈకి ఫోన్‌చేస్తే ఫోన్ డైవర్ట్‌లో ఫోర్‌మెన్ వచ్చేవారు. ఏఈ లేకపోవడంతో ఈ సెక్షన్‌లో అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. నిబంధనల ప్రకారం కొత్త మీటర్ మంజూరు చేయాలంటే అన్ని రకాల పత్రాలు పరిశీలించిన తర్వాతే ఇస్తారు. ఈ సెక్షన్‌లో మాత్రం ఒక్కో కొత్త మీటర్‌కు రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పైగా వసూలు చేయడం పరిపాటిగా మారింది. సింగల్ ఫేజ్ మీటర్‌లకు ఒకమాదిరిగా, త్రీఫేజ్ మీటర్‌కు మరొక విధంగా, పత్రాలు లేకుండానే వందల సంఖ్యలో మీటర్లు జారీ చేస్తున్నారు. కొత్త మీటర్ పెట్టాలన్నా, మీటర్‌లో సమస్యలు వచ్చినా, స్తంభాలు, లైన్‌లు మార్చడం వంటి పనులు చేయి తడిపితేనే అవుతాయి. లేకుంటే అంతే సంగతులు.

పర్యవేక్షణ గాలికి..

ఆయా సెక్షన్ల పరిధిలో ఏం జరుగుతుందో పర్యవేక్షణ చేయాల్సిన ఏఈలు, ఏడీఈ తమకేమీ తెలియనట్లు ప్రవర్తిస్తున్నారు. జిల్లాలో నాలుగు డివిజన్ ఉన్నాయి. డివిజన్‌స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా నామ మాత్రంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. అందుకే నగరంలోనే నాగారం సెక్షన్ పరిధిలో ఏఈ సంతకం ఫోర్జరీ వరకు వెళ్లింది. డివిజన్ స్థాయి అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడంతో కిందిస్థాయిలో ఏం జరుగుతుందో ఎలా తెలుస్తుందని వినియోగదారులు పేర్కొంటున్నారు.

ఏఈ సెలవులో ఉన్నప్పుడే జరిగింది

నాగారం సెక్షన్ ఏఈ సెలవులో ఉన్నప్పుడే ఈ ఘటన జరిగింది. ఏఈ సంతకం ఫోర్జరీపై ఉన్నతాధికారులకు వివరించాం. ఎవరి ప్రమేయం ఎంత ఉందో తెలుసుకుంటున్నాం. ఏఈ సెలవులో ఉన్నప్పుడు ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదు. కేవలం నోటిమాట చూసుకొమ్మని మరో ఏఈకి చెప్పాం. నేను కూడా ఈ నెల 5 నుంచి 10 వరకు సెలవులో ఉన్నాను.

– శ్రీనివాస్‌రావు, డీఈ, విద్యుత్ శాఖ

విచారణ జరుగుతోంది

నాగారం సెక్షన్‌లో ఏఈ సంతకం ఫోర్జరీపై సీఎండీ వరుణ్‌రెడ్డి చాలా సీరియస్‌గా ఉన్నారు. దీనిపై క్వాలిటీ కంట్రోల్ ఏడీఈతో విచారణకు ఆదేశాలు ఇచ్చాం. ఈ నెల 21న సాయంత్రం 5 గంటల వరకు నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఎవరు తప్పు చేసినా శిక్ష పడుతుంది.

– రవీందర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

పదెకరాలలోపు ఉన్న వారికే రైతుబంధు

- మాచారెడ్డి మండల సభ ఏకగ్రీవ తీర్మానం



సభలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

మాచారెడ్డి: పదెకరాల లోపు ఉండి, అది కూడా సాగు చేస్తున్న వారికి మాత్రమే మాత్రమే రైతుబంధు అందించాలని మాచారెడ్డి మండల సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. గురువారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అందించినట్లు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీతో కూడిన యంత్రాలు అందించాలని కూడా తీర్మానించారు. ఇరిగేషన్, వైద్య, విద్య, విద్యుత్ అధికారులతో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుబంధు 10 ఎకరాల లోపు ఉన్నవారికి వ్యవసాయం చేస్తున్న వారికి ఇవ్వాలని రాష్ట్రంలోనే మొదటిసారి ఏకగ్రీవ తీర్మానం చేసిన మండల పరిషత్ ప్రజా ప్రతినిధులకు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. మాచారెడ్డి మండల కేంద్రంలో 132 కేవీ సబ్‌స్టేషన్ త్వరలో మంజూరు చేయిస్తానన్నారు. చివరి సమావేశం కావడంతో ఎంపీటీసీలను ఎంపీపీలను సన్మానించారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పూల్ చంద్ నాయక్, ఎంపీడీవో గోపి బాబు, తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న పోచారం

బాన్సువాడ రూరల్ : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మాతాశిశు ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనహిత సంస్థ విరాళంగా అందించిన సెల్‌కౌంటర్, ఆక్సీ జనరేటర్ పరికరాలను ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని సోమేశ్వర్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ వైద్యులు హిమబిందు, అశ్విన్‌రెడ్డి జనహిత సంస్థ ద్వారా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సుమారు రూ.3లక్షల వైద్య పరికరాలు విరాళంగా అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రఘుపతి రెడ్డి, సతీష్‌రెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, తిలకేశ్వర్‌రఘు తదితరులున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపు తండాలో గురువారం పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి సంస్థ కో–ఆర్డినేటర్ రాయల భూపతి వివరించారు. రసాయన ఎరువుల వాడటం వల్ల జరిగే అనర్థాలను తెలియజేశారు. నేలను సారవంతంగా మార్చడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియపర్చారు. గ్రామంలో పాలదిగుబడి, వెన్నశాతం పెంచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. విలేజ్ డెవెలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేసి గ్రామంలో పంటల దిగుబడి పెంచి రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి అలు అభివృద్ధి, ఆర్థిక ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యదర్శి పరిపూర్ణ, మాజీ సర్పంచ్ నాన్కుబాయి పీర్యానాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ గెంట్యాల అంజనేయులు,తదితరులున్నారు.

హైస్కూల్‌కు కిట్ బహూకరణ

మాచారెడ్డి : మిత్రుని జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది యూనియన్ నాయకులు అభినందనీయులని ఆరేపల్లి హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శ్రీనివాస్ కొనియాడారు. ఆ యూనియన్ నాయకుడు తారక్ నాథ్ జ్ఞాపకార్థం గురువారం పాల్వంచ మండలం ఆరేపల్లి హైస్కూల్ విద్యార్థులకు బ్యాంక్ యూనియన్ నాయకులు సైన్స్ కిట్ అందజేశారు. ఎస్‌బీఐ యూనియన్ నాయకులు రాజేశ్వర్ రావు, భాస్కర్ రాజు, అనుదీప్, నరేందర్, మహేశ్వర్ రెడ్డి, రాంప్రసాద్ తదితరులున్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



మాచారెడ్డి : మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సన్న డిమాండ్ చేశారు. గురువారం మాచారెడ్డి మండల కమిటీని ఏర్పాటు చేసిన అనంతరం మాట్లాడారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వక పోతే ఆందోళన చేస్తామన్నారు. రైతు కూలీ సంఘం మండల నూతన కార్యవర్గ సభ్యులు ఎండీ. ఆలీ, సయ్యద్ అలీ తదితరులున్నారు.

నిరుపేద వృద్ధులకు అన్నదానం

భిక్కనూరు : మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఉన్న హన్‌మాన్ ఆలయం వద్ద శ్రీ సాయిహనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం కొనసాగింది. ప్రతి గురువారం తమ సంస్థ తరఫున నిరుపేదలైన వృద్ధులకు ఇతర గ్రామాల నంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు అన్నదానం చేస్తున్నట్లు శ్రీ హన్‌మాన్ సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

పాఠశాలల్లో పనులు పూర్తవ్వాలి



బీబీపేటలో నులి పురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బీబీపేట: పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు నర్సరీ, వైకుంఠ ధామం, పల్లె ప్రకృతి వనము, ఉప్పరపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రంను సందర్శించారు. పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. నర్సరీని సందర్శించి ఇంకా మెరుగుపర్చాలని, మొక్కల బ్లాక్‌లు క్రమపద్ధతిలో పెట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫామ్స్‌ను అందజేశారు. ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్, ఎంపీవో కృష్ణ, డిప్యూటీ ఇరిగేషన్ అర్చన, ఏఈ పవన్ కుమార్ తదితరులున్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

బీబీపేట : జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు హరిజనవాడ, మున్నూరుకాపువాడలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. పిల్లలకు కడుపులో నట్టలు ఉన్నట్లయితే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి వంటి వాటితో బాధపడతారని అన్నారు. ప్రభుత్వ వైద్యాధికారిణి భానుప్రియ, సీహెచ్‌వో ప్రమీల, సూపర్‌వైజర్ సత్యానంద్, ఆరోగ్యకార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు

- ఎమ్మెల్యే మదన్‌మోహన్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి: ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అధికారులకు సూచించారు. ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల నియోజకవర్గస్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు మండలాలలో ప్రభుత్వం పోడు భూములను గిరిజనులకు పట్టాలు చేసి ఇచ్చినా రెవెన్యూ అధికారులు వారిని వ్యవసాయం చేసుకోనివ్వకుండా అడ్డుపడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. గిరిజనులు తమకు అందజేసిన పోడు భూములలో ట్రాక్టర్ల ద్వారా సేద్యం చేసుకుంటుంటే రెవెన్యూ, అటవీ అధికారులు అడ్డు చెబుతున్నట్లు తెలిసిందని అన్నారు. నేటి పరిస్థితులలో పశువుల ద్వారా వ్యవసాయం చేయడం సాధ్యపడదని ట్రాక్టర్ల ద్వారా సేద్యం చేసుకుంటే ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని రెవెన్యూ అధికారులను నిలదీశారు. విద్యుత్ శాఖ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయంటూ ప్రతిపక్షాలు అనవసర ప్రచారం చేస్తున్నారని, దీనిని తిప్పికొట్టేలా విద్యుత్ శాఖ అధికారులు సాధ్యమైనంత వరకు నాణ్యమైన నిరంతర విద్యుత్ ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలో నత్తనడకన సాగుతున్న బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణాల వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని కోరారు. మొదటి రోజున పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ, విద్యుత్, ఐకేపీ, రెవెన్యూ, ఆర్టీసీ, ఐసీడీఎస్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

20 రోజుల్లో ఐదు ఆత్మహత్యలు

- రామారెడ్డి ఠాణా పరిధిలో కలకలం
- అనారోగ్యంతో గురువారం వృద్ధుడి ఆత్మహత్య

రామారెడ్డి: రామారెడ్డి పరిధిలో వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. జూన్ 1 నుంచి 20 వరకు మండలంలో ఐదుగురు వ్యక్తు లు వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గురువారం రామారెడ్డికి చెందిన దండబోయిన నర్సయ్య(78) అనారోగ్యం, కొడుకు కోడలు చనిపోయిన విషయంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గడిచిన 20 రోజుల్లోనే ఇసన్ననపల్లి , రామారెడ్డి, అన్నారం గ్రామాలకు చెందిన యువకులు, కన్నాపూర్ తండాకు చెందిన ఓ మహిళ, తాజాగా ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడడం విస్మయానికి గురి చేస్తోంది. ఆత్మహత్యలకు నివారణకు అధికార యంత్రాంగం వీలైనంత తొందరగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ ఐదు ఆత్మహత్యలు గుర్తు చేస్తున్నాయి.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ ఏఈ మృతి



రవీందర్ (ఫైల్)

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ – నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఆటోనగర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ శాఖ రూరల్ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న రవిచంద్ర(47) మృతి చెందాడు. సీఐ వీరయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని బీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న రవిచంద్ర విద్యుత్ శాఖలో రూరల్ ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా నిజామాబాద్‌లోని విద్యుత్ కార్యాలయంలోని స్టోర్ రూమ్‌కి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా ఆటోనగర్ వద్ద డివైడర్‌కు ఢీ కొట్టుకుని తీవ్రగాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినప్పటికీ రవిచంద్ర అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య పద్మజ విద్యుత్ శాఖలోనే జేఈవోగా విధులు నిర్వర్తిస్తుండగా, మృతుడికి కొడుకు వెంకటప్రసాద్, కూతురు శ్రీజ ఉన్నారు. పద్మజ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు..

మాచారెడ్డి: మండలంలోని భవానీపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాల్వంచ మండలం భవానీపేటకు దోమకొండ బాల్‌రాజ్ (74) బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గ్రామంలోని కల్లు డిపోనకు నడుచుకుంటూ వెళ్తుండగా కామారెడ్డి–సిరిసిల్లా రహదారిపై వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన బాల్‌రాజ్‌ను 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రిని చంపిన కొడుకుకు ఐదేళ్ల జైలు

వర్ని: మద్యం మత్తులో తండ్రిని చంపిన కొడుకుకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బోధన్ సెషన్స్ కోర్టు జడ్జి రవికుమార్ గురువారం తీర్పు వెలువరించారు. వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని కోకల్‌దాస్ తండాకు చెందిన వినోద్ 2021లో మద్యంమత్తులో తన తండ్రి ధూప్యాను హత్య చేశాడు. సాక్ష్యాధారాలు రుజువుకావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. ఈ కేసులో పబ్లిక్‌ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు వాదనలు వినిపించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు మూడు నెలల శిక్ష..

ఎడపల్లి: అజాగ్రత్త ట్రాక్టర్ నడిపిన డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ బోధన్ అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి సాయి శివ తీర్పు ఇచ్చారని ఎస్సై వంశీచందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. 2017లో మండలంలోని వడ్డేపల్లికి చెందిన భరత్, ఈశ్వర్ సైకిల్‌పై కిరాణాసామాను కోసం ఎడపల్లికి వెళ్తుండగా మట్టి లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. భరత్ కాళ్లపైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. అలాగే ఈశ్వర్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుల కుటుంబసభ్యులు ఫిర్యాదు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా, ట్రాక్టర్ డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్షతోపాటు పరిహారం కింద ఒకరికి రూ.5 వేలు, మరొకరికి రూ. 10 వేలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

ఎల్లారెడ్డి: నెలరోజుల క్రితం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించిన నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఆలయంలోని సీసీ ఫుటేజీ ద్వారా నిందితుడిని లింగంపేట మండలం ఎక్కపల్లి తండాకు చెందిన మాలోత్ గణేశ్‌గా గుర్తించామన్నారు. ఆలయ ప్రవేశ ద్వారం తాళం పగులగొట్టిన నిందితుడు లోనికి ప్రవేశించినప్పటికీ నగదు, ఇతర వస్తువులు లభ్యం కాలేదన్నారు. అలాగే లింగంపేట, నాగిరెడ్డిపేట, తాడ్వాయి, దేవున్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో నిందితుడు గణేశ్ చోరీలకు పాల్పడినట్లు తెలిపారు.

స్టాక్‌యార్డ్ నుంచి ‘థార్’ వాహనం చోరీ

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ శివారులో ఉన్న మహీంద్రా షోరూం ఆవరణ నుంచి దుండగులు ‘థార్’ వాహనాన్ని ఎత్తుకెళ్లారు. షోరూం మేనేజర్ సాయినాథ్, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. షోరూం వెనుక ప్రాంతంలోని స్టాక్ యార్డ్‌లో కొత్త వాహనాలు ఉంచుతారు. రెండు రోజుల క్రితం స్టాక్ యార్డ్ తాళం చెవి కనిపించకుండాపోయింది. బుధవారం రాత్రి సుమారు 8.15 గంటలకు దుండగులు స్టాక్ యార్డ్ వెనుక వైపు ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి కొత్త థార్ (బ్లాక్ కలర్) వాహనాన్ని ఎత్తుకెళ్లారు. తిరుమల ఇన్‌స్టిట్యూట్ ప్రహరీ పక్కనుంచి కియా షోరూం మీదుగా ప్రధాన రోడ్డుపైకి చేరుకుని వాహనంతో పాటు పారిపోయారు. గురువారం ఉదయాన్నే తాళం చెవి దొరకడంతో స్టాక్ యార్డ్ తెరిచిన షోరూం సిబ్బంది థార్ వాహనం చోరీకి గురైనట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తమ సిబ్బందితో షోరూం చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

ఐదుగురిపై కేసు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఐదుగురిపై కేసునమోదు చేసినట్లు ఏఎస్సై సంజీవులు గురువారం తెలిపారు. ఇంటి స్థలం విషయంలో గ్రామానికి చెందిన తిరుపతి, సంగయ్యపై అదే గ్రామానికి చెందిన నర్సారెడ్డి, కపిల్, ఆనంద్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి,. ధర్మారెడ్డి కలిసి దాడిచేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్య మృతిని తట్టుకోలేక ఆత్మహత్య

ఖలీల్‌వాడి: భార్య మరణాన్ని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పవన్‌నగర్‌కు చెందిన ఎర్రోళ్ల శ్యామ్(42) భార్య గౌరి ఈనెల 2వ తేదీన అనారోగ్యంతో మృతి చెందింది. పిల్లలు లేకపోవడంతో అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న శ్యామ్ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అక్క కేసరి విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక..

ఖలీల్‌వాడి: కడుపునొప్పి భరించలేక నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లాపరిషత్ రోడ్డులో ఉన్న మున్సిపల్ క్వార్టర్స్‌లో గొండల రాహుల్(28) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నెల రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్న రాహుల్ బుధవారం ఆస్పత్రిలో చూయించుకోగా అపెండిసైటిస్ ఉన్నట్లు వైద్యులు చెప్పారు. మహబూబ్‌నగర్‌లో మున్సిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న తన తండ్రి వెంకటేశ్వర్లుకు రాహుల్ విషయం తెలుపగా, ఆయన బుధవారం రాత్రి నిజామాబాద్‌కు బయల్దేరాడు. ఇంటికి చేరుకున్న వెంకటేశ్వర్లు తలుపుతట్టగా రాహుల్ తీయలేదు. అనుమానంతో వెంకటేశ్వర్లు కిటికీలో నుంచి చూడగా రాహుల్‌ఉరేసుకొని కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

నవీపేట: మండలంలోని ఆశాజ్యోతి గ్రామానికి చెందిన ఐటోళ్ల రాజు(37) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. జులాయిగా తిరిగే రాజు గత కొంతకాలంగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుటుంబ కలహాలతో..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎడపల్లి(బోధన్): కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై బోధన్ పట్టణం రాకాసీపేటకు చెందిన బోగేవార్ రమేశ్(35) జానకంపేట శివారులోని అశోక్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. లేబర్‌గా పనిచేసే రమేశ్ అశోక్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకోగా, గురువారం నీటిలో మృతదేహం తేలింది. గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన జగదీశ్(53) అదృశ్యమైనట్లు మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈనెల 9న దుకాణానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన జగదీశ్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికారు. జగదీశ్ ఆచూకీ లభించకపోవడంతో అతడి సోదరుడు దేవేందర్ ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు.

కామారెడ్డికి చెందిన వివాహిత..

కామారెడ్డి టౌన్: పట్టణంలోని గొల్లవాడకు చెందిన పొన్నాల లక్ష్మి తన ముగ్గురు పిల్లలతో కలిసి కొత్తబస్టాండ్ నుంచి అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. భర్తకు చెప్పకుండా ముగ్గురు పిల్లలతో కలిసి గురువారం ఉదయం 10 గంటలకు కొత్తబస్టాండ్‌కు వచ్చిన లక్ష్మి ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. ఆమె భర్త స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇద్దరి రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల్‌కు చెందిన నీల స్వామిని గొంతుకోసి హత్యచేసేందుకు యత్నించిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. గత సోమవారం నీల స్వామిపై అతని బంధువులైన నవీన్, సుధాకర్ మెంగారం గ్రామం వద్ద కత్తితో దాడి చేసి గొంతుకోసి పరారయ్యారు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని సుధాకర్, తమ కుటుంబంతో గొడవపడ్డాడని నవీన్.. స్వామిపై కక్ష పెంచుకొని హత్య చేసేందుకు యత్నించారని ఎస్సై తెలిపారు.

కరెంటు షాక్‌తో గేదె మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పల్లెగడ్డలో నునావత్ విఠల్‌కు చెందిన పాడి గేదె గురువారం కరెంటు షాక్‌తో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గేదె గ్రామ శివారులో మేత మేస్తుండగా అక్కడనే ఉన్న కరెంటు వైర్లకు తగలడంతో షాక్ వచ్చి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.90 వేల వరకు ఉంటుందని, విద్యుత్ అధికారులు తనకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితుడు విఠల్ కోరారు.